సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: ఎమ్మెల్యే


ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంలో నివాసం ఉంటున్న రమణి కొన్ని నెలలుగా మోకాళ్ల నొప్పుల సమస్యలతో బాధపడుతున్నారు. చికిత్స చేయించుకోవడానికి వారికి ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేని ఇటీవల ఆశ్రయించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మోకాళ్ల ఆపరేషన్‌కు కావలిసిన డబ్బుల వివరాలను సీఎం సహాయనిధికి దరఖాస్తు చేశారు. దీంతో రమణి ఆపరేషన్ కోసం లక్షరూపాయల ఎల్ఓసీ మంజూరైంది. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లక్షరూపాయల ఎల్ఓసీని రమణి కుటుంబ సభ్యులకు సుధీర్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ధర్మకర్త ఛాతిరి మధుసాగర్, రాకేష్, ఠాగూర్ పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కల్యాణ వేడుకలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం వారికి స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, బింగి దేవదాసు గౌడ్, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కోట ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులుయాదవ్‌తో పాటు యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ పనులు వేగవంతం చేయాలి: శ్వేత


బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని బాక్స్‌డ్రైన్ నాలా పనులు వేగవంతం చేయాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేత కోరారు. ఆదివారం సింగరేణి కాలనీ ఆఫీసర్స్‌కాలనీ, ఆదర్శ నగర్‌లలో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ నాలా పనులను ఆమె పరిశీలించారు. పనులు నత్తనడకగా సాగుతున్నాయని, దీంతో వరద ముంపు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత ఎస్ఎన్‌డీపీ అధికారులు, కాంట్రాక్టర్‌ను పిలిపించారు. వర్షాలు రాకముందే పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏతః కృష్ణయ్య, భరత్‌కాలనీవాసులు కేఎస్ఎన్‌రెడ్డి, రమణ, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని వీరాంజనేయకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తమ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్‌ని కోరారు. ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన 'ఇలవైకుంఠం' నృత్య రూపకం

కొత్తపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హంస, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. మద్దాళి ఉషాగాయత్రి శిష్య బృందం ప్రదర్శించిన 'ఇలవైకుంఠం' కూచిపూడి నృత్య రూపకం ఆద్యంతం అలరించింది. మద్యాధూల రమాకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీనివాసకల్యాణ వేదికపై శ్రీనివాసుడి కీర్తనలకు కళాకారిణుల నృత్యాభినయం అందరి మన్ననలు పొందింది. హృద్యంగా పాడిన శ్రీమన్నారాయణ తదితర కీర్తనలకు కళాకారిణుల హావభావ ప్రకటనను శాస్త్రీయ నృత్యాభిమానులు అభినందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

వేంకటేశ్వరాలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం


నూతన సభ్యులతో ఆలయ కమిటీ ఛైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్నకృష్ణ

కొత్తపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి కాలనీ గోదాసమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నూతన సభ్యులుగా శ్రీకాకుళం సాయిరాం, శ్రీకాకుళం శ్రీనివాస్‌లు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఛైర్మన్ వారణాశివంశీ వారికి నియామక పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ప్రసన్నకృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, సలహాదారులు వెంకటస్వామి, బాపిరాజు, మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

భయపెడుతున్న బైక్ రేసింగ్స్

- పలువురిపై కేసు నమోదు.. బైక్‌లు సీజ్
- అయినా.. తీరు మార్చుకోని బైక్ రేసర్లు


ఐటీ కారిడార్‌లో బైక్‌రేస్‌ల హల్‌చల్

రాయదుర్గం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో ఆకతాయిలు నిర్వహించే బైక్ స్టంట్స్, కట్స్, బైక్‌రైడ్‌లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శని, ఆదివారాలు వచ్చాయంటే రాయదుర్గం ఐటీ కారిడార్‌లోని టీహబ్ పరిసర ప్రాంత రహదారులపై బైక్‌రైడర్లు గుంపులుగుంపులుగా వచ్చి ప్రజలు తిరుగుతున్న సమయంలోనే బైక్ స్టంట్స్, రేసింగ్‌లు చేస్తూ హడలెత్తిస్తున్నారు. 15 రోజుల క్రితం రాయదుర్గం పోలీసులు రాత్రి సమయంలో బైక్‌రేసింగ్ చేస్తున్న సుమారు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఆకతాయిలు డోంట్‌కేర్ అంటూ మళ్లీ బైక్ రేస్‌లు, స్టంట్‌లు చేస్తూ రోడ్డుపై వెళ్తున్న ప్రజలను హడలెత్తిస్తున్నారు. శనివారం రాత్రి రోడ్డు సందడిగా ఉన్న సమయంలోనే రెచ్చిపోయారు. బైక్‌టైర్లపై పెట్రోల్‌పోసి మంటలు అంటిస్తూ రేసింగ్‌లు నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరుగురు బైక్‌రైడర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అలాగే, బంజారాహిల్స్ తాజ్ హోటల్ వద్ద బైక్‌పై వెళ్తున్న సీనియర్ జర్నలిస్ట్‌ను అతివేగంతో దూసుకెళ్లిన గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బైక్‌రేస్‌లు, స్టంట్స్ చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా మరుగుదొడ్లకు తాళం

- పరిశుభ్ర నగరం.. ప్రకటనలకే పరిమితం
- పట్టించుకోని బడంగ్‌పేట్ అధికార యంత్రాంగం


టాయ్‌లెట్ల నిర్వహణకు సంబంధించిన వివరాలు నమోదు చేయకుండా వదిలేసిన దృశ్యం


(తాళం కప్పతో దర్శనమిస్తున్న ప్రజా మరుగుదొడ్లు)

సరూర్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్.. 'మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకుందాం.. పరిశుభ్రంగా జీవిద్దాం!!'.. 'మన నగరం.. మన బాధ్యత'.. ఇవీ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ప్రజా మరుగుదొడ్ల(పబ్లిక్ టాయ్‌లెట్స్) గోడలపై కనిపించే నినాదాలు! ప్రతి ఒక్కరూ ప్రజా మరుగుదొడ్లు వాడాలని, తద్వారా నగరాన్ని పరిశుభ్రంగా తయారు చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యం!! కానీ.. బడంగ్‌పేట్‌లో వాస్తవ పరిస్థితి తద్విరుద్ధంగా ఉంది. 'స్వచ్ఛ భారత్- హరిత తెలంగాణ'లో భాగంగా ప్రజల కోసం ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ప్రజా మరుగుదొడ్లు 'ఎనీ టైమ్ లాక్ అవుట్' అన్నట్టుగా నిత్యం తాళం వేసి కనిపిస్తున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులో అల్మాస్‌గూడ శ్మశానవాటిక వద్ద నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణపై అధికారులు, పాలకులు దృష్టి పెట్టకపోవడంతో ఎంతో ఉదాత్త లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ టాయ్‌లెట్స్ 'యూజ్‌లెస్'గా మారిపోయాయి.

ఉగ్గబట్టుకుని ఉరికితే.. కనిపించేది తాళం కప్పే..!

అల్మాస్‌గూడలోని పబ్లిక్ టాయ్‌లెట్ వద్దకు ఎవరైనా ఉగ్గబట్టుకుని పరుగెడితే.. అక్కడి రెండు గేట్లకు తాళం కప్పలు వెక్కిరిస్తూ కనిపిస్తుంటాయి. పురుషుల కోసం, మహిళల కోసం వేర్వేరుగా వీటిని నిర్మించినా అవి ఎవరికీ ఉపయోగం లేకుండా వృథాగా పడి ఉన్నాయి. మొదట్లో కొన్నాళ్ల పాటు తెరిచి ఉంచగా.. వాటిలోని టాయ్‌లెట్ కుండీలు, నల్లాలు, తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారంటూ తాళాలు వేశారు. ఇక అప్పటి నుంచి వాటిని తెరిచిన పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. పక్కనే కోమటి కుంట చెరువు ఉండడంతో మలమూత్ర విసర్జన కోసం ఆ ప్రాంతాన్నే ఎంచుకుంటున్నారు. దాంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారుతోందని ఆ రోడ్డున వెళ్లే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ టాయ్‌లెట్స్ అందుబాటులోకి తీసుకువస్తే అక్కడి పరిసరాలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉన్నదని స్థానికులు పేర్కొంటున్నారు. పక్కనే ఉన్న శ్మశానవాటికలోకి అంత్యక్రియలకు వచ్చే వారికి ఉపయోగపడతాయనుకుంటే వారికి సైతం తాళం కప్పలే దర్శనమిస్తున్నాయి. దాంతో అత్యవసర పరిస్థితుల్లో వారంతా చెరువు పరిసరాలనే ఎంచుకోక తప్పడంలేదు.

టాయ్‌లెట్‌కు ఐడీ లేదు.. ఏజెన్సీ పేరు కూడా లేదు..

కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసే పబ్లిక్ టాయ్‌లెట్స్‌కు ప్రత్యేకంగా ఒక ఐడీ(గుర్తింపు నంబర్) కేటాయించి, నిర్వహించే ఏజెన్సీ పేరు, సూపర్‌వైజర్ పేరు, ఫోన్ నంబర్ వగైరా వివరాలు అక్కడ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే అల్మాస్‌గూడలోని టాయ్‌లెట్స్ గోడపై మాత్రం కేవలం ఒక పేపర్ అంటించి ఎలాంటి వివరాలూ అందులో పొందుపరచకపోవడం గమనార్హం! దీనిని బట్టి బడంగ్‌పేట్ అధికారులకు, పాలకులకు స్వచ్ఛ భారత్ లక్ష్యంపై ఎంత శ్రద్ధ ఉన్నదో అర్థం చేసుకోవచ్చునని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పబ్లిక్ టాయ్‌లెట్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

ప్రజా క్షేత్రంలో సేవకుడిగానే పనిచేస్తా

- ఎంపీ ఈటల రాజేందర్


అభినందన సభలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం హయత్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడు తాను ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని అన్నారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

వీరన్నగుట్ట రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న ఈటల

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ హయత్‌నగర్ వీరన్నగుట్టలోని రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాజరాజేశ్వరీ కాలనీ, శివంహిల్స్, వినాయకనగర్ కాలనీలలో ఆయన పర్యటించి ప్రజలను కలిసి ఎన్నికల్లో భారీ మెజారిటీ అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ అభివృద్ధికి కృషి చేస్తా

కొత్తపేట: మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గంలో భాగమైన ఎల్బీనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడించారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఈశా కన్వెన్షన్‌లో ఈటల రాజేందర్ అభినందన, సన్మానసభ ఏర్పాటు చేశారు. సన్మానసభలో ఈటల మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్‌కు తగిన సహకారమందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందడుగు వేస్తానన్నారు. నాయకులు, కాలనీల ప్రతినిధులు ఆయనను పుష్పగుచ్ఛాలు, శాలువలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్, నాయకులు సుందర్‌నారాయణ, అశ్విన్ సింగ్, మహేందర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు సహకారం అందిస్తా

వనస్థలిపురం: మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలిసిన సందర్భంగా మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పెద్దచెరువు ప్రాంగణంలో చెట్లు నాటి అనంతరం కాలనీవాసులకు కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ తనకు లక్ష పైచిలుకు మెజార్టీని అందించిన ఎల్బీనగర్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఎల్బీనగర్ అభివృద్ధికి కార్పొరేటర్లకు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

చాదర్‌ఘాట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నడుమ జరిగిన ప్రిలిమినరీ పరీక్షల్లో అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. గడ్డిఅన్నారం చౌరస్తాలోని ప్రగతి డిగ్రీ కళాశాల, ప్రగతి మహిళ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ మహిళ డిగ్రీ కళాశాల రెండు భవనాల్లో, మలక్‌పేట టీవీ టవర్ వద్దనున్న సెయింట్ థామస్ సంహిత జూనియర్ కళాశాల రెండు భవనాల్లో, దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీయల్ మహిళ డిగ్రీ కళాశాల, గడ్డిఅన్నారంలోని శ్రీవేంకటేశ్వర కామర్స్ డిగ్రీ కళాశాల, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి చైతన్య జూనియర్ కళాశాల, గడ్డిఅన్నారం చౌరస్తాలోని న్యూ నోబుల్ డిగ్రీ కళాశాల, దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ కళాశాల రెండు భవనాల్లో, సిద్ధార్థ డిగ్రీ కళాశాల, సాకేత డిగ్రీ కళాశాల, శ్రీసాయి డిగ్రీ, పీజీ కళాశాల, అరుణోదయ డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి పరిసర ప్రాంతాల్లో ఎవరు గుమ్మిగూడకుండా ఉండేందుకు 144 సెక్షన్‌ను అమలు చేశారు. పోలీస్ గస్తీని ముమ్మరం చేశారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు



మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

ఎల్బీనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు ఆరోపించారు. ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల నిర్మాణ మహాసభ బైరామల్‌గూడలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. సీపీఐ సహాయ కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పర్వతాలు మాట్లాడుతూ కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఏఐటీయూసీ పోరాటాలు కొనసాగిస్తూనే ఉన్నదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆందోజు రవీంద్రాచారి మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు అండగా నిలబడి వారికి నీడనిచ్చిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. ఈ సభలో ఏఐటీయూసీ భవన నిర్మాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా నాయకుడు శేఖర్ రెడ్డి, బాతరాజు నర్సింహ, కందుల సుధాకర్, సక్రునాయక్, నాగేష్, గోపాల్, చిన్నారి పాల్గొన్నారు. అనంతరం ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బోయపల్లి రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి, కార్యవర్గసభ్యులుగా గోపాల్, నారాయణ, కర్నాకర్, శ్రీను, యాదయ్య, నరేష్, చిన్నారి జ్యోతి, దర్శనంతో పాటు 29మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో వర్షం

- జలమయమైన రహదారులు
- మరో రెండు రోజులు వర్షాలు


వర్షానికి దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీటిని తొలగిస్తున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. ఆదివారం సాయంత్రం ఉరుములు,మెరుపులతో కురిసిన వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోయింది. హయత్‌నగర్‌లో 2.3, డిఫెన్స్‌కాలనీలో 2, అస్మన్‌ఘడ్‌లో 1.5 సెం.మీ వర్షం కురిసింది. దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ప్రధాన రహదారులపై వరదనీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీహెచ్ఎంసీ డిజాస్టర్ బృందాలు వరదనీటిని తొలగించాయి. సైదాబాద్, కుర్మగూడ, సరూర్‌నగర్, అంబర్‌పేట, ఉప్పల్, బండ్లగూడ, న్యూనాగోల్, అజంపురా, ఐఎస్‌సదన్, చార్మినార్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురిసింది. గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు ఉరుములతో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గరిష్ఠంగా 35, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలుంటాయని, ఉపరితల గాలులు గంటకు 6-10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా వీచే అవకాశముంటుందన్నారు.

ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ విజయవంతం

అల్వాల్: ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ భారతదేశంలో మొదటిసారిగా సెయిలింగ్‌కు సంబంధించి సెయిలర్స్ పోటీల్లో ఎంత దూరం ప్రయాణించాలి అనే అంశంపై ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే తెలిపారు. ఆదివారం ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ కార్యక్రమంలో ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో హుస్సేన్‌సాగర్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సెమినార్ పోటీలకు సంబంధించి రెండు రోజులుగా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డియాజ్ మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ ప్రతినిధి ఇవాన్‌తో సహా 18మంది ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌లో పాల్గొన్నారు.

రక్తదాన ఆవశ్యకతను తెలిపిన రన్

- అపోలో ఆస్పత్రి, టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ


రన్‌ను ప్రారంభిస్తున్న తేజస్వీరావు తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో ఆస్పత్రి, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)తో కలిసి 'వాక్.డొనేట్.రిపీట్' అనే లక్ష్యంతో మూడు కిలోమీటర్ల రన్‌ను జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి వద్ద ఆదివారం నిర్వహించారు. రక్తదానం ప్రాముఖ్యత, అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశంగా ఈ వాక్‌ను నిర్వహించామని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. దాదాపు 1500 మంది టీసీఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానంపై తమకున్న నిబద్ధతను చాటారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రులు(తెలంగాణ రీజియన్) సీఈఓ తేజస్వీరావు, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్(తెలంగాణ రీజియన్) డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని తాము చేపట్టిన ఈ వాక్‌కు టీసీఎస్ సహకారం అందించడం హర్షణీయమన్నారు. అనంతరం టీసీఎస్ రీజినల్ హెడ్ చల్ల నాగ్, హెడ్ ఆఫ్ టీసీఎస్ హైదరాబాద్ హెచ్ఆర్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ అపోలో సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం వల్ల ఒక యూనిట్ బ్లడ్ ముగ్గురి జీవితాల్లో వెలుగులను నింపుతుందని డాక్టర్ సుధారంగనాథన్ అన్నారు.

బీజేపీ నాయకుడు అశోక్‌గౌడ్ మృతి



కొత్తపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బీజేపీ కొత్తపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు కాట అశోక్‌గౌడ్ ఆదివారం మృతిచెందారు. పాతతరం బీజేపీ సీనియర్ నాయకుడిగా అశోక్‌గౌడ్ కొత్తపేట పరిధిలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణకు కృషిచేశారు. రూ కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరవయిందని ఆయన పలుమార్లు ఆందోళన చేపట్టారు. ఆయన మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈటల సంతాపం, కుటుంబ సభ్యులకు పరామర్శ

ఎల్బీనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు కాట అశోక్‌గౌడ్ మృతి పట్ల ఎంపీ ఈటల రాజేందర్ సంతాపం తెలిపారు. అశోక్‌గౌడ్ పార్థీవదేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు పవన్‌కుమార్, కొప్పుల నర్సింహారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు యశ్పాల్‌గౌడ్, బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ అంజన్‌కుమార్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్, జంగారెడ్డి, వజీర్‌కుమార్, దాసుగౌడ్ ఉన్నారు.

కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు వచ్చేలా చూడండి

- వక్కలంక శ్రీనివాస్

ఎల్బీనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు వచ్చేలా చూడాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు కోరారు. ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్యాంపెయినింగ్ కమిటీ ఛైర్మన్ మధుయాష్కీని ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు నిజాయితీకి మారుపేరుగా ఉన్నారన్నారు. పార్టీలు మారి వచ్చిన వారు మళ్లీ వారికి పదవులు రాకపోతే వెళ్లిపోతారని ఆయన తెలిపారు. వారు పార్టీలో పనిచేయడానికి పనికిరారన్నారు. వారంతా స్వార్థం కోసం వచ్చి పార్టీలో పదవులు దక్కకుంటే వెళ్లిపోతారని ఆయన అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పదవులు వచ్చినా రాకున్నా పార్టీనే నమ్ముకుని దశాబ్దాలుగా పార్టీకి సేవ చేస్తున్నారని ఆయన చెప్పారు. అలాంటి వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు.

ఇసుక క్వారీలలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సామాజిక తెలంగాణ ఫ్రంట్ ఛైర్మన్ వెన్నపూజ పరుశురాం

హయత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైన్స్ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం మన్సూరాబాద్ డివిజన్‌లోని లెక్చరర్స్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సామాజిక తెలంగాణ ఫ్రంట్ ఛైర్మన్ వెన్నపూజ పరుశురాం హాజరై మాట్లాడుతూ ఇసుక క్వారీలలో పీఓలు, ఎస్ఆర్ఓ, ఎస్ఆర్‌పీలు కాంట్రాక్టర్‌లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వీరిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంత కాలంగా వీరంత లారీ డ్రైవర్‌లను బెదిరించి ఓవర్ లోడింగ్ చేస్తున్నారని తెలిపారు. లారీ రోడ్డుపైకి రాగానే ఓవర్ లోడ్ ఉందని ఆర్‌టీఏ అధికారులు చలానాలు రాస్తున్నారని పేర్కొన్నారు. రెండు విధాలుగా తామంత తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై టీఎస్ఎండీసీ అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి ఇసుక క్వారీలలో తిష్ట వేసి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను వెంటనే బదిలీ చేయాలని ఆయన కోరారు. ఓవర్ లోడింగ్‌లను ప్రోత్సహిస్తున్న కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మైన్స్ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుర్వి దామోదర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫైటర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ తెప్పా కరుణ, సీహెచ్ యాదగిరి, ఎస్ఆర్ స్వామి గౌడ్, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

5.7 కిలోల గంజాయి పట్టివేత


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు

హయత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో ఓ ఇంట్లో గంజాయి ఉందన్న సమాచారంతో ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేసి 5.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలో విక్రయించేందుకు తీసుకువచ్చి హయత్‌నగర్‌లోని షిరిడీనగర్ రోడ్డు నంబర్ 6లో ఓ ఇల్లును అద్దెకు తీసుకుని అందులో దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఆదిలాబాద్‌కు చెందిన తిరుపతి చిత్తురుకు చెందిన గణేష్ వీరమురళీ, శ్రీకాకుళంకు చెందిన సాయికిరణ్ ద్వారా గంజాయిని బస్సులో శనివారం సికింద్రాబాద్‌కు తీసుకువచ్చారు. అక్కడి నుంచి గంజాయిని హయత్‌నగర్ తీసుకువచ్చి ఓ ఇంట్లో దాచిపెట్టారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులు తిరుపతి, సాయికిరణ్, గణేష్ వీరమురళీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో సీఐ శ్రీధర్, ఎస్ఐ జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ లేకా సింగ్, కానిస్టేబుల్‌లు వికాస్, రాంచందర్‌లు పాల్గొన్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు కేసును హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాటసింగారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

- హుండీల్లోని చిల్లర నగదు అపహరణ
- ఆలయ సమీపంలోని చెట్లపొదల్లో హుండీలు


చెట్ల పొదల్లో పడవేసిన హుండీ


దొంగల వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి దుండగులు ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడ ఉన్న రెండు హుండీల తాళాలు పగులకొట్టి అందులోని చిల్లర నగదును అపహరించుకుపోయారు. అనంతరం రెండు హుండీలను ఆలయ సమీపంలోని చెట్ల పొదల్లో పడేశారు. కాగా ఆదివారం ఉదయం గుడిని తెరిచేందుకు వచ్చిన అర్చకుడు వెంకటాచారికి ప్రధాన ద్వారం తాళాలు పగులకొట్టి కనిపించింది. వెంటనే లోపలికి వెళ్లి చూడగా హుండీలు కనిపించలేదు. ఆలయంలో చోరీ జరిగిందని గమనించిన అర్చకుడు వెంటనే ఈ విషయాన్ని గ్రామస్థులతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు తెలిపారు. అక్కడికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో దుండగుల వేలి ముద్రలను సేకరించారు. త్వరలోనే చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.